# సాక్షి మంచిర్యాల

ఆదివారం । 30 । జూన్ । 2024






**మన 'సారా' మానలేక..!**

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో నాటుసారా తయారీ యథేచ్ఛగా సాగుతోంది. మహారాష్ట్ర నుంచి ముడి సరుకు రవాణా అవుతోంది. అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తున్నారు. 8లో▸



**హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు**

ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మెన్, ఉమెన్ బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. 10లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 32.0 /26.0

రోజంతా వర్షం కురిసే అవకాశం ఉంది. నైరుతి దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### జిల్లా జడ్జిని కలిసిన డీసీపీ



జడ్జి శ్రీనివాసులుతో డీసీపీ భాస్కర్‌రావు

**మంచిర్యాలక్రైం:** మంచిర్యాల డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఏ.భాస్కర్‌రావు శనివారం మర్యాద పూర్వకంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులును కలిశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఆయన ప్రత్యేక చాంబర్‌లో కలిసి మొక్క అందజేశారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులు, శిక్షలు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. న్యాయవ్యవస్థ, పోలీసు సమన్వయంతో క్రైమ్‌రేట్ తగ్గించేందుకు కృషి చేయాలని తెలిపారు.

**పోలీస్ కమిషనర్‌ను కలిసిన డీసీపీ**

డీసీపీ ఏ.భాస్కర్‌రావు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి, నేర నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు.

**డీసీపీని కలిసిన అడిషనల్ పీపీ**

మంచిర్యాల జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పులి రాజమల్లు, లైజన్ ఆఫీసర్ గులాం దస్తాగిరి స్థానిక డీసీపీ భాస్కర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డీసీపీ, పీపీలు జిల్లాలో నెలకొన్న వివిధ సమస్యలపై చర్చించారు.

### ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకుంటాం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

**రామకృష్ణాపూర్:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. క్యాతనపల్లిలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో శనివారం రాత్రి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సన్మాన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు హామీలను తాము కచ్చితంగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు తమ ప్రభుత్వంపై కావాలని దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం ఏదీ నెరవేర్చలేదనేది ప్రజలు గుర్తించాలన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు తనవంతు సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ ఎమ్మెల్సీలు వెంకట్రావ్, పురాణం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

### బాధితులకు న్యాయం చేయాలి

**మంచిర్యాలక్రైం:** గుర్తు తెలియని వాహనం ఢీకొని పారిపోయిన కేసుల్లో బాధితులకు త్వరగా పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో స్థానిక ఏసీపీ ప్రకాష్, మంచిర్యాల ఆర్డీవో రాములు, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణలతో సమన్వయం సమావేశం నిర్వహించారు. అదనపు సీనియర్ సివిల్ కోర్టులో ఉన్న హిట్ అండ్ రన్(గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడం) కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించే విషయంలో దిశానిర్దేశం, పలు సూచనలు చేశారు.

### గణాంకాల పాత్ర ముఖ్యమైనది..



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** మానవ నిత్య జీవితంలో గణాంకాల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, రెండో పంచవర్ష ప్రణాళిక రూపొందించడలో ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహలనోబిస్ ముఖ్య పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్‌లో ప్రశాంత చంద్ర మహలనోబిస్ జయంతి సందర్భంగా నిర్వహించిన 18వ జాతీయ గణాంక దినోత్సవ వేడుకలకు ముఖ్య ప్రణాళిక అధికారి మహ్మద్ ఖాసీంతో కలిసి హాజరై జిల్లా గణాంక దర్శిని 2022-23, మండల గణాంక దర్శిని పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప గణాంక అధికారులు బీ.రాజేందర్, ఎఆర్‌కే మూర్తి ఎస్.పాపయ్య, బి.సురేష్, ఏ.అనురాధ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాదా సలాం, మండల ప్రణాళిక, గణాంక అధికారులు వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# చక చకా ధరణి!



- జిల్లాలో వేగంగా అర్జీల పరిష్కారం
- గత రెండు వారాల్లో 21వేలకు పైగా క్లియర్

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** భూ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపడంతో దరఖాస్తులు వేగంగా పరిష్కారం అవుతున్నాయి. కొన్ని చిక్కులు ఉన్నవి మినహా చాలావరకు పెండింగ్ లేకుండా అధికారులు తమ లాగిన్లలో పూర్తి చేస్తున్నారు. దరఖాస్తులు వచ్చిన వెంటనే పరిష్కారం, తిరస్కరణ చేస్తున్నారు. దీంతో జిల్లాలో ధరణి పోర్టల్ పరిధిలో ఉన్న పలు సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సైతం పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించడం తెలిసిందే. దీనిపై ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ క్రమంలో చాలా వరకు సమస్యలు చక చకా తీరుతున్నాయి.

**వేగంగా పరిష్కారం**

ఈ నెల 15నుంచే ధరణి పోర్టల్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో వేగంగా పరిష్కారం అవుతున్నాయి. శనివారం ఒక్క రోజే 923 అర్జీలు పరిష్కారం అయ్యాయి. గత వారం రోజులుగా జిల్లాలో ఎప్పటికప్పుడు పెండింగ్ ఉంచకుండా చూసుకుంటున్నారు. తహసీల్దార్లు, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్, కలెక్టర్ వరకు లాగిన్‌లో ఉన్నా అధికంగా తహసీల్దార్లు, ఆర్డీవోల స్థాయిలోనే ఉన్నాయి. వీటిలో కోర్టు కేసులు, డేటా కరెక్షన్, వారసత్వ, నిషేధిత జాబితా అధికంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలతో వీటికి పరిష్కారంపై జాప్యం జరుగుతోంది. అయినప్పటికీ కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు వేగంగా అర్జీలు కదులుతున్నాయి. గత రెండు వారాల్లో జిల్లాలో మొత్తం దరఖాస్తుల్లో మంచిర్యాల డివిజన్ పరిధిలోనే 30వేలకు పైగా దరఖాస్తులు రాగా, వీటిలో సగానికి పైగా క్లియర్ అయ్యాయి. బెల్లంపల్లి డివిజన్ పరిధిలో 12వేలు రాగా, వీటిలోనూ సగానికిపై అధికారులు క్లియర్ చేశారు. ఎక్కువ డివిజన్ స్థాయిలోనే అర్జీలు పేరుకుపోతున్నాయి. దీంతో ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని ఆదేశాలు రావడంతో ధరణి పోర్టల్‌పైనే అధికారులు ఎక్కువగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో భూ సమస్యలపై వచ్చిన అర్జీల సమస్య తీరనుంది.

**ఈ నెల 15 నుంచి 28 వరకు పరిష్కారం, పెండింగ్ వివరాలు**

| కేటగిరీ | పరిష్కారం | పెండింగ్ |
|---|---|---|
| ఎన్ఆర్ఐ పీపీబీ | 0 | 02 |
| కోర్టు కేసుల పరిధి | 51 | 397 |
| కోర్టు కేసు పీపీబీ | 01 | 46 |
| డేటా కరెక్షన్ | 199 | 3697 |
| జీపీఏ | 0 | 03 |
| నిషేధిత జాబితా | 0 | 769 |
| పీపీబీ/నాలా నివాస స్థలాలు | 06 | 378 |
| ఖాతా కలపడం | 05 | 03 |
| ల్యాండ్ మ్యాటర్ గ్రీవెన్స్ | 16 | 719 |
| నాలా డబ్ల్యూఓ పీపీబీ | 39 | 81 |
| పెండింగ్ మ్యూటేషన్ | 06 | 361 |
| వారసత్వ | 62 | 879 |
| పట్టణ భూములు | 0 | 02 |
| మొత్తం | 385 | 7319 |

### దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్



పాల్గొన్న కలెక్టర్ కుమార్‌దీపక్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** ధరణి పోర్టల్‌లో పెండింగ్ ఉన్న దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో ధరణి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారం రోజుల్లోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. 14 రకాల అంశాలతో కూడిన దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయని, తహసీల్దార్, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో నూతనంగా నిర్మించనున్న సమీకృత గురుకుల పాఠశాలలు, కళాశాలలకు స్థల సేకరణ చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 7,319 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతీ రోజు దాదాపు 400 దరఖాస్తులు పరిశీలిస్తున్నామని, మరో మూడు రోజుల్లో తహసీల్దార్ పరిధిలో దరఖాస్తులను పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్డీవో పరిధిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో సమీకృత గురుకుల పాఠశాల, కళాశాల కోసం కోటపల్లి మండలంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల సమీపంలో దాదాపు 20 ఎకరాల భూమిని గుర్తించామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, కలెక్టరేట్ బీ సెక్షన్ పర్యవేక్షకులు మధుసూదన్, అధికారులు పాల్గొన్నారు.

**'ధరణి' పోర్టల్‌లో అధికారుల లాగిన్‌లో పెండింగ్ వివరాలు(ఈ నెల 29 వరకు)**

| దరఖాస్తులు | పరిష్కారం | తిరస్కరణ | తహసీల్దార్ | ఆర్డీవో | అదనపు కలెక్టర్ | కలెక్టర్ |
|---|---|---|---|---|---|---|
| 43,350 | 21,816 | 13,024 | 2,960 | 3,260 | 789 | 176 |

# చెరగని ముద్ర



రాథోడ్ రమేశ్ పార్థివదేహం వద్ద కుటుంబ సభ్యులు, పరామర్శిస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

- ముగిసిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ప్రస్థానం
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు
- ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌గా పలు హోదాల్లో రాణింపు
- బంజారా నేత హఠాన్మరణంతో హతాశులైన కార్యకర్తలు, అభిమానులు

**సాక్షి, ఆదిలాబాద్:** మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని రాజకీయ ఉద్దండులు అభిప్రాయపడుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీచైర్మన్‌గా పలు హోదాల్లో రాణిస్తూ తనదైన శైలిని చాటారని ప్రత్యర్థులు కూడా ప్రశంసించకుండా ఉండలేని పరిస్థితి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి సామాన్య కార్యకర్తగా పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి బహుముఖ హోదాల్లో పొలిటికల్ ఇమేజ్‌ను సాధించారని ఆయన గురించి ముందు నుంచి తెలిసినవారు చెబుతారు. అలాంటి నేత హఠాన్మరణంతో కార్యకర్తలు, అభిమానులు హతాశులయ్యారు. తమ సమాజానికి వన్నెతెచ్చిన నేత ఇక లేరా అని బంజారాలు కన్నీరు పెట్టుకుంటున్నారు.



రాథోడ్ రమేశ్ (ఫైల్)

### సామాన్య ప్రజల కోసం రాథోడ్ రమేశ్ కృషి

**ఆదిలాబాద్:** సామాన్యుల కోసం రాథోడ్ రమేశ్ ఎంతగానో కృషి చేశారని మాజీ ఎంపీ సోయం బాపూరావు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. రమేశ్ మృతిపై సంతాపం తెలిపారు. ఆయన మరణం ఉమ్మడి జిల్లా రాజకీయాలకు తీరని లోటని పేర్కొన్నారు.

**సామాన్య కుటుంబం నుంచి..**

నార్నూర్ మండలం తడిహత్నూర్‌కు చెందిన లంబాడా దంపతులు మోహన్ రాథోడ్- కమలాబాయిలకు 1966, అక్టోబర్ 20న రాథోడ్ రమేశ్ జన్మించారు. ప్రాథమిక విద్య తడిహత్నూర్‌లో, ఉట్నూర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి, ఆదిలాబాద్‌లో డిగ్రీ కళాశాలలో బీఏ చదివారు. వీరిది వ్యవసాయ కుటుంబం. సుమన్‌బాయితో వివాహం జరిగింది. వీరికి కూతురు సోనాలీ, ఇద్దరు కుమారులు రితీశ్ రాథోడ్, డాక్టర్ రాహుల్ రాథోడ్ ఉన్నారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రాథోడ్ రమేశ్ టీడీపీ నుంచి 1995లో నార్నూర్ జెడ్పీటీసీగా ఎన్నికయ్యారు. అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. 1999లో టీడీపీ నుంచే ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గోవింద్ నాయక్ చేతిలో రమేశ్ ఓటమి చెందారు. అయితే 2006లో ఆసిఫాబాద్ జెడ్పీటీసీగా గెలుపొంది ఎస్టీ రిజర్వ్‌డ్ అయిన ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ స్థానాన్ని అధిష్టించారు. 2009 వరకు ఆ పదవిలో కొనసాగారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం ఉన్నప్పటికీ అప్పట్లో రాథోడ్ రమేశ్ గెలుపు సంచలనంగా మారింది. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లా రాజకీయంలో తనదైన శైలీలో చక్రం తిప్పారు. దీంతోనే రాజకీయాల్లో ఆయనకు డేరింగ్ అండ్ డ్యాషింగ్ నేత అని పలువురు సంబోధిస్తారు.

### చివరి వరకు క్రియాశీలకమే..

రమేశ్ రాజకీయంగా ఉన్నత స్థానంలో ఉన్న సమయంలో ఖానాపూర్ అసెంబ్లీ స్థానంలో కొన్ని యాదృచ్ఛిక సంఘటనలు చోటు చేసుకున్నాయి. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో టీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే గోవింద్‌నాయక్ 2008లో అధినేత కేసీఆర్ పిలుపు మేరకు పదవికి రాజీనామా చేశారు. అప్పుడు రాథోడ్ రమేశ్ జెడ్పీ చైర్మన్‌గా ఉన్నారు. ఆ తర్వాత ఖానాపూర్ అసెంబ్లీకి జరిగిన ఉప ఎన్నికల్లో రాథోడ్ రమేశ్ తన సతీమణి సుమన్‌రాథోడ్‌ను ఈ నియోజకవర్గం నుంచి బరిలోకి దింపి గెలిపించారు. ఏడాది పాటు ఎమ్మెల్యేగా కొనసాగిన సుమన్ రాథోడ్ ఆ తర్వాత 2009లోను ఖానాపూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించడం విశేషం. ఇదిలా ఉంటే 2014 తర్వాత ముఖ్యమైన పదవులకు దూరమైన రమేశ్ రాజకీయంగా కొంత ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. కొద్ది నెలలు మాత్రమే కొనసాగి అనంతరం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. 2018లో ఖానాపూర్ అసెంబ్లీ, 2019లో పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి 2021లో బీజేపీలో చేరారు. 2023లో ఖానాపూర్ అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేసిన ఆయన మరోసారి ఓటమి చవిచూశారు. కాగా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా టికెట్ ఆశించిన ఆయనకు చుక్కెదురైంది. అయినప్పటికీ పార్టీ అభ్యర్థి గోడం నగేశ్ గెలుపుకోసం కృషి చేశారు. ఇటీవలే ఢిల్లీ వెళ్లిన ఆయన ప్రమాణం స్వీకారం చేసిన బీజేపీ కేంద్ర మంత్రులను, ఎంపీలను కలిసి గురువారమే జిల్లాకు తిరిగి వచ్చారు. ఢిల్లీలో ఉన్న సమయంలో ఆస్పత్రిలో చెకప్ కూడా చేసుకున్న ఆయన అక్కడి నుంచి తిరిగి వచ్చిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురై తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

## మధ్యాహ్న భోజనానికి నీటి సరఫరా

సాక్షి ఎఫెక్ట్..

**మంచిర్యాలఅర్బన్:** 'నీళ్లు లేక మధ్యాహ్న భోజనం బంద్' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యాధికారులు స్పందించారు. స్థానిక హమాలీవాడ ప్రాథమిక పాఠశాలలో బోర్‌వెల్ మరమ్మతు చేయాలని సూచించారు. అప్పటివరకు ప్రత్యామ్నాయంగా మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌తో నీటి సరఫరా చేయాలని ఆదేశించారు.

**టీచర్లను నియమించాలని ఆందోళన**

హమాలీవాడ ప్రాథమిక పాఠశాలలో టీచర్ ఖాళీలను భర్తీ చేయాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు. నీరు లేక మరుగుదొడ్లు కంపుకొడుతున్నా పట్టించుకోకపోవడంపై తప్పుబట్టారు. తరగతి గది నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి వచ్చేలా చొరవ చూపాలని విద్యాధికారులను కోరారు. ఆందోళనకు బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యక్షుడు సంతోష్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జాతీయ విద్యార్థి సమైక్య ప్రధాన కార్యదర్శి వంశీ పాల్గొన్నారు.



విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో ఆందోళన

**సమస్యలు పరిష్కరించాలి**

జిల్లా కేంద్రంలోని సినిమావాడ, హమాలీవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మన ఊరు-మనబడిలో కొత్త భవనం కోసం పనులు చేపట్టినా పూర్తి కాలేదని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే దశలవారీగా ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సన్నీగౌడ్ పాల్గొన్నారు.

## 'పోలీస్‌శాఖకు అందించిన సేవలు అమోఘం'

**మంచిర్యాలక్రైం:** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ హోదాల్లో ఇప్పటివరకు పని చేసి పోలీస్ శాఖకు అందించిన సేవలు అమోఘమని పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు కొనియాడారు. కమిషనరేట్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన ఏడుగురు అధికారులకు శనివారం కమిషనరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వారం రోజుల క్రితమే మంచిర్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్.రాజమౌళిగౌడ్ అతి తక్కువ సమయంలో పెండింగ్‌లో ఉన్న 70 పిటిషన్లను పరిశీలించారని, 30కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించి ఏకం చేయడం అభినందనీయమని కొనియాడారు. రాజమౌళిగౌడ్‌తోపాటు సీఐ సిరాజ్ అహ్మద్, ఎస్సై కళాంధర్‌రెడ్డి, ఏఆర్ ఎస్ఐ కే.లచ్చన్న, ఏఎస్సై డి.స్వామి, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమచారి, జూనియర్ అసిస్టెంట్ ఎస్.రామచంద్రం సేవలను సీపీ కొనియాడారు. అధికారుల దంపతులను సన్మానించారు. పోలీస్ వాహనంలో ఇంటివరకు సాగనంపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ అశోక్‌కుమార్, పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.



సీఐ దంపతులతో సీపీ శ్రీనివాసులు, అధికారులు

## ప్రైవేటులో సాధారణ ప్రసవాలు చేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అనిత
- గైనకాలజిస్టు వైద్యులతో సమావేశం

**మంచిర్యాలటౌన్:** జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలే చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టు వైద్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 23 మంది వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో అనిత మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ ప్రసవాలు తగ్గించాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దని, ప్రసవాలను పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారంగా ప్రతి ఒక్కరూ రిజిష్టర్ చేసుకోవాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ఆసుపత్రిలో ధరల పట్టిక, వైద్యుల వివరాలు, అందిస్తున్న సేవలు, ఫైర్ సర్టిఫికెట్, బయోవేస్టేజ్, అన్ని రకాల సేవల వివరాలు ఉండాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల వివరాలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో తెలియజేయాలని, రిజిస్ట్రేషన్ లేకుండా ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని, స్కానింగ్ కేంద్రాల్లో ధరల వివరాలతోపాటు లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం అనే అవగాహన పోస్టర్లు అతికించాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ నీరజ, మాస్ మీడి యా అధికారి వెంకటేశ్వర్లు, డీపీవో ప్రశాంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

## కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి



డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ప్రథమ బహుమతి సాధించిన చిత్రలేఖనం

- డీఈవో యాదయ్య
- విద్యార్థులకు పోటీలు

**మంచిర్యాలఅర్బన్:** ప్రతీ విద్యార్థి ఇంట్లో మొక్కలు నాటి కాలుష్య రహిత సమాజానికి చేయూతనివ్వాలని డీఈవో యాదయ్య అన్నారు. జిల్లా సైన్స్ సెంటర్‌లో శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే అంశాలపై విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, కవితల పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ఎస్జీసీ పాఠశాలలకు చెందిన 206 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. కవితల పోటీల్లో లక్సెట్టిపేట మండలం జెండావెంకటపూర్ 9వ తరగతి విద్యార్థిని హాసిని ప్రథమ, టీఎస్ మోడల్‌స్కూల్ మంచిర్యాల విద్యార్థిని ఎన్.సాహిత్య ద్వితీయ, జెడ్పీహెచ్ఎస్ దొనబండకు చెందిన సాయి స్పందన తృతీయ బహుమతికి ఎంపికయ్యారు. పోస్టర్ మేకింగ్‌లో కాసిపేట మండలం దేవాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ప్రీతి ప్రథమ, వెంకట్రావ్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని శ్రావ్య ద్వితీయ, దొనబండ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన సాయిస్పందన తృతీయ స్థానంలో నిలిచారు. త్వరలో బహుమతి, సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని డీఎస్‌వో మధుబాబు తెలిపారు.

## బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే ఫ్లైఓవర్ ఆలస్యం

- ఆర్వోబీకి అడ్డంకులన్నీ తొలగించాం
- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే శనివారం మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణపు పనులను పరిశీలించారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే ఆర్వోబీకి నిధులు మంజూరు చేయించానని, బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం కనబర్చిందని మండిపడ్డారు. బ్రిడ్జి నిర్మాణంలో జాప్యంపై కాంట్రాక్టర్‌పై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్వోబీ నిర్మాణంలో ప్రస్తుతం అడ్డంకులన్నీ తొలగిపోయి అటు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం కూడా చెల్లించినందున నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం కుర్మపల్లిలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, గాండ్ల సమ్మయ్య, శ్యాంగౌడ్, వొడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్, నాయకులు

## క్లుప్తంగా

### కుళ్లిన మృతదేహం లభ్యం

జన్నారం: జన్నారం మండలం పొనకల్ గ్రామ శివారులోని శ్రీలంక కాలనీ చర్చి సమీపంలో కుళ్లిన మృతదేహం శనివారం లభ్యమైంది. పొనకల్ ఈవో రాహుల్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రాజవర్ధన్ మృతదేహాన్ని పరిశీలించగా కుళ్లిపోయిన స్థితిలో ఉంది. మృతదేహం జన్నారంలో కార్పెంటర్‌గా పని చేసే జగ్గు(50)దిగా గుర్తించారు. జగ్గుకు ఎవరూ లేకపోవడంతో గ్రామ పంచాయతీ సిబ్బంది మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. ఈవో రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### కార్మికుడికి గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్న అశోక్ శనివారం గాయపడ్డాడు. అశోక్ భూగర్భంలో పని చేస్తున్న క్రమంలో బొగ్గు పెళ్లలను టబ్బుల్లో నింపుతుండగా ప్రమాదవశాత్తు వేలు నలిగిపోయింది. వెంటనే ఆయనను ఆర్కే 8 డిస్పెన్సరీకి తీసుకొచ్చి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రామకృష్ణపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రున్ని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి అక్బల్ అలీ, ఏరియా సెక్రెటరీ మారెపల్లి సారయ్య, ఫిట్ సెక్రెటరీ రవీందర్, నాయకులు ప్రతాప్, రమేశ్, బానేశ్‌లు పరామర్శించారు.

### 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కాగజ్‌నగర్ రూరల్: పింఛన్ మొత్తాన్ని పెంచుతామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్, ఆనంద్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని బాలభారతి పాఠశాల వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ.. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కోశాధికారి సప్తగిరి, ఉపాధ్యక్షులు రాజు, జాకీర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# మన 'సారా' మానలేక!

- జిల్లాలో యథేచ్ఛగా సారా తయారీ
- మహారాష్ట్ర నుంచి ముడిసరుకు రవాణా
- మొక్కుబడిగా అధికారుల దాడులు



మహారాష్ట్ర నుంచి తరలిస్తున్న ముడిసరుకును పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లాలోని పలు అటవీ ప్రాంతాల్లో నాటు సారా తయారీ యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించేందుకు సారా తయారీ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లోని చెట్ల మధ్య సారాబట్టీలు ఏర్పాటు చేసుకొని తయారు చేస్తున్నారు. చెన్నూర్ నియోజకవర్గంతో పాటు హాజీపూర్ మండలంలోని అటవీ ప్రాంతాలకు సమీపంలో గల గ్రామాలు సారా తయారీకి అడ్డాగా మారాయి. సిర్సా, అన్నారం, నీల్వాయి, కోటపెల్లి, బ్రాహ్మనపల్లి, అర్జునగుట్ట గ్రామాల్లో సారా తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. వందల లీటర్ల సారాను ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. గ్రామాల్లోని పొలిమేరల్లో కాపలాదారులను పెట్టి అధికారులు వస్తే సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకొని అక్కడి నుంచి తప్పించుకుంటున్నారు. కాగా ఆయా గ్రామాల్లో పశువుల కాపర్లు అటవీ ప్రాంతంలోకి వెళ్లేందుకు జంకుతున్నారు. సారా బట్టీలు ఉండే ప్రదేశాలకు వెళ్లే పశువుల కాపరులను సారా తయారు చేసే వారు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలుస్తోంది.

**అక్కడే మకాం..**

నాటు సారా తయారీకి వ్యాపారులు రోజుల తరబడి అడవుల్లోనే మకాం వేస్తున్నారు. సారా తయారీకి అవసరమైన ముడి సరుకులు యూరియా, పటిక బెల్లం వంటివి మహారాష్ట్ర నుంచి చేరవేస్తున్నారు. తయారు చేసే వారికి కావాల్సిన ఆహార పదార్థాలను కుండలు, క్యాన్లలో తరలిస్తున్నారు. నీటి వసతి ఉన్న చోట సారా బట్టీలు ఏర్పాటు చేసుకొని తయారైన సారాను క్యాన్లలో పల్లెలు, పట్టణాలకు అక్రమంగా తరలిస్తున్నారు. సారా తయారీ సామగ్రిని తయారీదారులకు చేరవేసేందుకు రోజువారీ కూలీలను వ్యాపారులు వినియోగించుకుంటున్నారు. కూలీలకు భోజనంతో పాటు రూ.300 నుంచి రూ.500 వరకు కూలి చెల్లిస్తున్నారు.

**తూతూ మంత్రంగా..**

అబ్కారీ శాఖలోని కొంతమంది అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సారా తయారీదారుల నుంచి మామూళ్లు తీసుకొని ఉన్నతాధికారుల కదలికలను సారా తయారీదారులకు చేరవేస్తున్నట్లుగా కొందరు సారా వ్యాపారులే బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పుడు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి, బెల్లం పానకం, సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఫలించని ప్రభుత్వ వ్యూహం..**

నాటు సారా నియంత్రణకు గత ప్రభుత్వం సారా విక్రయదారులను గుర్తించింది. వారికి ఉపాధి కల్పనలో భాగంగా రూ.2లక్షల విలువైన వివిధ రకాల యూనిట్లు నెలకొల్పేందుకు ఆర్థిక సాయం అందజేసింది. జిల్లాలో 247 మందిని గుర్తించి అర్హులైన 211 మందికి పూర్తిస్థాయి ప్యాకేజీ అందించారు. అయినా కొందరు సారాదందా మళ్లీ కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఇటీవల పోలీసుల దాడులు..**

- గత నెల 17న నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుయ్యారం గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సారా తయారీ కేంద్రంపై దాడి చేసి భూమిలో పాతిపెట్టిన ప్లాస్టిక్ డ్రమ్మును తవ్వి తీశారు. ఇలా నాలుగు చోట్ల డ్రమ్ములు వెలికి తీశారు. దాడిలో 4,200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.
- జిల్లాలోని మందమర్రి మండలం ఆవడం గ్రామ శివారులో ఈనెల 1న రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 11 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పొన్నారం గ్రామానికి చెందిన ముప్పిడి శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**

సారా తయారీ కేంద్రాలపై టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు నిత్యం దాడులు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎవరైనా సారా విక్రయాలు జరిపితే సమాచారం ఇవ్వాలి. ఇప్పటికే అటవీ ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేశాం. సారా తయారీకి వినియోగించే ముడిసరుకు విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాం. సారా తయారీ, విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– కే.జీ నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి, మంచిర్యాల

# కవ్వాల్ అందాలు భేష్

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- సఫారీలో ప్రయాణం



బైసన్‌కుంట వద్ద పీవో, కుటుంబ సభ్యులు

జన్నారం: కవ్వాల్ అడవుల్లో ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శనివారం కుటుంబ సభ్యులతో కలిసి పర్యటించారు. ఉదయం గేట్ నంబరు-1 నుంచి గోండుగూడ బేస్‌క్యాంప్, బైసన్‌కుంట, మల్యాల వాచ్‌టవర్ వరకు సఫారీలో ప్రయాణించారు. బైసన్‌కుంటలో కాసేపు పక్షులు, జంతువులను చూశారు. అడవిలో కొంతసేపు గడిపారు. సఫారీలో వెళ్తున్న క్రమంలో చుక్కల దుప్పులు, అడవి దున్నలు, అడవి పందులు, కొండగొర్రెలు, వన్యప్రాణులు, సర్పెంట్ ఈగల్, హాక్ ఈగల్, కింగ్ ఫిషర్, అలెక్సా డ్రీన్ వంటి పక్షులు చూసి మురిసిపోయారు. పచ్చదనం పరుచుకున్న అడవుల్లో పర్యటించడం గొప్ప అనుభూతి కలిగించిందని పేర్కొన్నారు. వీరికి జన్నారం ఇంచార్జీ రేంజ్ అధికారి సుష్మారావు, సిబ్బంది ఇక్కడి వివరాలు తెలియజేశారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



యంత్రాలకు పూజలు చేస్తున్న జీఎం మనోహర్

కాసిపేట(బెల్లంపల్లి): సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ అవసరం ఉన్న యంత్రాలను సమకూరుస్తుందని, ఉద్యోగులు సమన్వయంతో పని చేసి రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి ఏరియా జీఎం ఎ.మనోహర్ సూచించారు. శనివారం ఏరియాలోని కాసిపేట -2 గనికి నూతనంగా వచ్చిన రెండు ఎస్‌డీఎల్ యంత్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కో ఎస్‌డీఎల్ యంత్రం ధర రూ.50 లక్షలు ఉందని, మందమర్రి ఏరియాకు 12 యంత్రాలను కేటాయించడం సంతోషకరమన్నారు. ప్రస్తుతం 8 యంత్రాలు రాగా రెండు కాసిపేట -2గనికి కేటాయించామన్నారు. ఏజెంట్ రాందాస్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేశ్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏరియా ఇంజనీర్ సూర్య నారాయణరాజు, గ్రూపు ఇంజనీర్ రాంప్రసాద్, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# భూ అక్రమాల కేసులో బిగుస్తున్న ఉచ్చు

ఆసిఫాబాద్: జిల్లాలో జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లింపుల్లో జరిగిన అక్రమాలకు సంబంధించిన కేసులో ఉచ్చు బిగుస్తుంది. ఈ కేసులో ఏసీబీ అధికారులు శనివారం నలుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. భూముల నష్టపరిహారానికి సంబంధించి పలు అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఫిర్యాదులు రావడంతో గత మే 21న గతంలో ఇక్కడ పని చేసిన ఆర్డీవో సిడాం దత్తు, డీటీ నాగోరావు, ఎంసీ భరత్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సుబ్బ శంభుదాస్, లక్ష్మీనారాయణ గౌడ్, డ్రైవర్ తిరుపతితో పాటు రహదారి విస్తరణలో డబ్బులు పొందిన మరో మహిళా రైతుపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేశారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తిని సంప్రదించగా విచారణలో భాగంగా ఆర్డీవో సిడాం దత్తు, డీటీ నాగోరావు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సుబ్బ శంభుదాస్, లక్ష్మీనారాయణ గౌడ్‌లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

# గనుల వేలానికి వ్యతిరేకంగా పోరాటం




మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: తెలంగాణలో నూతన బొగ్గు గనుల వేలానికి నిరసనగా పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. శనివారం నస్పూర్ -శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలు మాట్లాడారు. హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూసీ కార్యదర్శి చాంద్‌పాషా, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, జీఎల్‌బీకేఎస్ ఉపాధ్యక్షుడు మేకల రాములు, టీఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మనిరాం సింగ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణలోని నూతన బొగ్గు గనులు వేలం వేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తే సింగరేణి పోటీని తట్టుకోలేక నష్టాల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. పలు డిమాండ్ల సాధనకు జూలై 4న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివిధ సంఘాల నాయకులు సారయ్య, జీవన్ జోయల్, బ్రహ్మానందం, సత్యం, పోషమల్లు, ఏడుకొండలు పాల్గొన్నారు.

**సింగరేణికే గనులు కేటాయించాలి**

శ్రీరాంపూర్: తెలంగాణలోని నూతన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రెటరీ కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్‌లు మాట్లాడారు. శ్రావణ్‌పల్లి గని వేలాన్ని కేంద్రం రద్దు చేయాలన్నారు. వేలానికి నిరసనగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు బండి రమేశ్, సత్తయ్య, అన్వేష్ రెడ్డి, సంతోష్, గోపియా తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బొగ్గు గనుల వేలాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, భోపాల్ డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లి పురవీధుల్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించి కాంటా చౌరస్తాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.రవి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ప్రకాశ్, అశోక్, నాయకులు జీ.అశోక్, రమణ, రంజిత్‌కుమార్, శ్రీకాంత్, దేవదాస్, తిరుపతి, సజీవన్, మనోహర్ పాల్గొన్నారు.

# రాథోడ్ రమేశ్ మృతి కార్మిక లోకానికి తీరనిలోటు



ఉట్నూర్ బస్ డిపోలో సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభిస్తున్న రాథోడ్ రమేశ్ (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: మాజీ ఎంపీ, ఎమ్మెల్యే రాథోడ్ రమేశ్ మృతి ఆర్టీసీ కార్మిక లోకానికి తీరని లోటని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజినల్ కార్యదర్శి భీమేశ్వర్‌రావు అన్నారు. ఆర్టీసీ కార్మికుల పక్షాన నిలిచి సమస్యలు పరిష్కరించేందుకు ఆయన కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2000 నుంచి 2009 వరకు ఉట్నూర్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా కొనసాగినట్లు పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రజల సౌకర్యం కోసం ఉట్నూర్ డిపో నుంచి మొదటిసారిగా సూపర్‌లగ్జరీ బస్సు ప్రారంభానికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## టీబీజీకేఎస్ కమిటీలో శ్రీరాంపూర్ నేతలకు చోటు



కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి



పెట్టం లక్ష్మణ్

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్ కేంద్ర కమిటీలో పోస్టుల కోసం ఎదురుచూస్తున్న శ్రీరాంపూర్ ఏరియా నేతలకు ఎట్టకేలకు చోటు దక్కింది. శనివారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. శ్రీరాంపూర్‌కు చెందిన కేతిరెడ్డి సురేందర్‌రెడ్డికి కేంద్ర ప్రధాన కార్యదర్శిగా కీలక పదవి దక్కింది. డెప్యూటీ ప్రధాన కార్యదర్శిగా బండి రమేశ్, జాయింట్ సెక్రెటరీగా పానగుంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా పొగాకు రమేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పెండ్రి అన్వేశ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గోపయ్య, రమేశ్, గోనే స్వామి, ఎండీ లాలను ఎన్నుకున్నారు.

**శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడిగా పెట్టం లక్ష్మణ్**

శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడిగా పెట్టం లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. బ్రాంచీ ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఆయనకు ఏరియా బాధ్యతలు అప్పగించారు.

## తాబేలు అప్పగింత



తాబేలును ఎఫ్‌డీవోకు ఇస్తున్న మహేశ్ దంపతులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని గుంటూరు కాలనీకి చెందిన గజ్జి మహేశ్–గీత దంపతులు తమ ఇంటి ఆవరణలోకి వచ్చిన తాబేలును శనివారం ఎఫ్‌డీవో అప్పలకొండకు అప్పగించారు. దీంతో ఎఫ్‌డీవో వీరిని అభినందించారు. తాబేలును అధికారులు కాగజ్‌నగర్ రేంజ్ అటవీప్రాంతంలో వదిలేశారు. ఎఫ్ఆర్వో రమాదేవి తదితరులున్నారు.

## కలెక్టరేట్ ముట్టడించిన ఏబీవీపీ నాయకులు



ఆందోళన చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: మెగా డీఎస్సీ ప్రకటించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. పర్మిషన్ లేని పాఠశాలలను వెంటనే మూసి వేయాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దీపక్, ఈశ్వర్, కార్యకర్తలు, సూర్య, చందు తదితరులు పాల్గొన్నారు.

# దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న మానిటరింగ్ సభ్యుడు కేశవ్‌రావు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన చాపిల వెంకటేశ్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన పొన్నం సాయి, పొన్నం శ్రీనివాస్, పొన్నం రాకేశ్‌లపై అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు రేగుంట కేశవ్ రావు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25న చాపిలె వెంకటేశ్‌ను అకారణంగా కులం పేరుతో దూషిస్తు దాడి చేశారన్నారు. అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా పోలీసులు స్పందించలేదన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల కిషోర్, మండల అధ్యక్షుడు నక్క శ్రీనివాస్, నాయకులు బాపు, లచ్చన్న, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీని 50 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ–టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని గంగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాల్వే చంద్రకాంత్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం గంగాపూర్‌లో నిర్వహించగా హాజరయ్యారు. చంద్రకాంత్ దంపతులను శాలువాతో సన్మానించి అనంతరం మాట్లాడారు. ప్రతీ పాఠశాలలో స్వచ్ఛ కార్మికులను నియమించాలని, ఎంఈవో పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు కేటాయించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో వెంటనే విద్యావలంటీర్లను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సప్లిమెంటరీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్వో, సీఆర్టీ, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఎమ్మార్సీల్లో పని చేస్తున్న సిబ్బందికి మినిమం టైం స్కేల్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ నాయకులు అనిల్, సదానందం, అబ్దుల్ లతీఫ్, సదానందం, రాజ కమలాకర్ రెడ్డి, రవిప్రసాద్, సత్తయ్య, శ్రీలత, వసుంధర, ఝాన్సీరాణి, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

# ఆసుపత్రిలో వసతులు కల్పించాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు కల్పించాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే ప్లాంట్, సీటీ స్కాన్‌లతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి ఆధ్వర్యంలో శనివారం ఆసుపత్రి ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కల్పించకుండానే బీఆర్ఎస్ హయాంలో ఆసుపత్రి ప్రారంభించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆసుపత్రిని దత్తత తీసుకొని వసతులు కల్పించాలన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తుల సమ్మయ్య, ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకులు కొండపాక చారి, కౌన్సిలర్లు కమ్మల శ్రీనివాస్, నాయకులు గర్రెపల్లి నర్సయ్య, కేవీఎం శ్రీనివాస్, లక్ష్మీనారాయణరెడ్డి, శివకృష్ణ, వంశీ, శ్రీపాల్, రాజు, శంకర్, గణేశ్‌సింగ్, రాజబాపు, రాజన్న, పోచన్నలు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేపట్టాలి

పాతమంచిర్యాల: పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్‌ల అమలు కోసం రాజ్యాంగ సవరణ చేపట్టాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు కర్రె లచ్చన్న, శ్రీపతి రాములు, చాకారపు బీంసేన్, ఓర శేఖర్, కే.శ్రీనివాస్, చంద్రమౌళి, బిక్షపతి, రాజేశం, లక్ష్మణ్, కిరణ్, భీంరావు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన టీజీఎఫ్‌డీసీ అధికారులు

మంచిర్యాలక్రైం: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) కాగజ్‌నగర్ డివిజన్ మేనేజర్ శ్రీ శ్రావణి, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్‌కుమార్, లక్ష్మణ్‌లు శనివారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న ప్లాంటేషన్ పనుల వివరాలను వివరించారు. సీఎస్ఆర్ నిధులతో ప్లాంటేషన్ ఏరియాలు ఉన్న గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కుందారం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## రాజకీయ చైతన్యాన్ని కలిగి ఉండాలి

బెల్లంపల్లి: సైద్ధాంతిక, రాజకీయ చైతన్యాన్ని కలిగి ఉండి, సమకాలిక అంశాలపై సరైన అవగాహన పెంచుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, భోపాల్ అన్నారు. బెల్లంపల్లిలో రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన రాజకీయ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రమణ, నాయకుడు నాగరాజ్ గోపాల్, జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.ప్రకాశ్, కె.అశోక్ పాల్గొన్నారు.

## చుక్కల దుప్పి హతం.. నలుగురి రిమాండ్



నిందితులతో ఫారెస్టు అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని వేంపల్లి ఫారెస్టు బీట్‌లో ఈనెల 13న చుక్కల దుప్పిని హతమార్చిన మరో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్వో రమాదేవి, డెప్యూటీ రేంజ్ అధికారి శశిధర్‌బాబు తెలిపారు. సిర్పూర్ (టి) మండలం వేంపల్లి గ్రామపంచాయతీలోని మన్నెగూడకు చెందిన చిట్లం బిక్షపతి, చిలకయ్య, నాగేశ్, కన్నెపల్లి రమేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదివరకే ఈనెల 17న మన్నెగూడ గ్రామానికి చెందిన నాయని అశోక్, రాలే అంజి, టేకం తిరుపతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కార్యక్రమంలో వేంపల్లి ఎఫ్‌బీవో విజయచంద్ర ఉన్నారు.

## ఒప్పంద, పొరుగు సేవల మెరిట్ జాబితా విడుదల

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఎన్‌హెచ్ఎం సిబ్బంది ఒప్పంద/పొరుగు సేవల పోస్టు భర్తీకి మెరిట్, ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ అర్హతతో నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్‌నర్సు)–5, బీఎస్సీ నర్సింగ్ అర్హతతో నర్సింగ్ ఆఫీసర్–4, ఫార్మాసిస్టు గ్రేడ్–2 పోస్టులు 5, డీఈవో 1, డీఈవో కమ్ అకౌంటింగ్ 1 పోస్టుల జాబితాను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఉంచినట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లోనూ https://mancherial. telangana. gov. in ఉంచామని, ఎంపికైన అభ్యర్థులు వచ్చే నెల ఒకటిన ఉదయం 11:30 గంటలకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.